# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-04-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.
2. తెలంగాణలో 2024 వర్షాధార పంటల కోసం 14 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
3. సార్వత్రిక ఎన్నికల తొలి విడత పోలింగ్ ప్రశాంతంగా ముగియగా.. 62.37 శాతం మేర ఓట్లు పోలయ్యాయని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.
4. వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దేశవ్యాప్తంగా వివిధ రైల్వే జోన్‌లలో 9 వేల 111 అదనపు రైళ్లను నడుపుతామని రైల్వే శాఖ ప్రకటించింది.
5. వ్యవసాయరంగ అభివృద్ధితోపాటు రైతులకు విస్తృత సేవలందించేందుకు దేశంలో మరో 114 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

==========================

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. గత మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 కోట్ల రూపాయల విలువైన నగదు, వస్తువులను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. సీ-విజిల్ యాప్ ద్వారా గురువారం వరకు మొత్తం 11 వేల 500 ఫిర్యాదులు అందాయని, వాటిలో దాదాపు 99 శాతం ఫిర్యాదులను 100 నిమిషాల్లోనే పరిష్కరించామని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 79 శాతం ఓటింగ్ నమోదైందని.. దాన్ని ఈసారి 83 శాతానికి పెంచేందుకు కృషిచేస్తున్నామని ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు.

--------------------------

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నిన్న జరిగిన తొలి విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. వేసవి దృష్ట్యా ఉదయమే ఓటర్లు పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. తొలిదశలో 102 స్థానాల్లో ఓటింగ్ జరగ్గా, వెయ్యి 625 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో 62.37 శాతం మేర ఓట్లు పోలయ్యాయని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. మొదటి దశ పోలింగ్లో అత్యధికంగా పశ్చిమ బంగలో నిన్న సాయంత్రం 5 గంటల వరకు 77.57శాతం మేర ఓటింగ్ నమోదైంది.

--------------------------

తెలంగాణలో 2024 వర్షాధార పంటల సీజన్ కోసం 14 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉద్యానవన శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. ఆయిల్‌పామ్‌తో సహా కూరగాయలు, పండ్లు, పూలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ పంటలు ఈ జాబితాలో ఉన్నాయి. రాష్ట్రంలో ఆహార, వాణిజ్య, ఇతర వ్యవసాయ పంటల సాగు ఏటేటా పెరుగుతున్నా కూరగాయల సాగులో ఆశించిన పురోగతి లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఈ వానాకాలం సీజన్‌లో ఉద్యాన పంటలను సాగు చేయాలని ఆ శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

---------------------------

వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రైళ్లు నడిపేందుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా వివిధ రైల్వే జోన్‌లలో రికార్డు స్థాయిలో 9 వేల 111 అదనపు ట్రిప్పులు నడుపుతామని ప్రకటించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 43 శాతం అధికమని ఒక ప్రకటనలో పేర్కొంది. గత ఏడాది వేసవిలో మొత్తం 6 వేల 369 అదనపు ట్రిప్పులు నడిపామని.. ఈసారి ఆ సంఖ్యను 9 వేల 111కు పెంచామని వెల్లడించింది. వీలైనంత ఎక్కువ మంది ప్రయాణికులు గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా అవసరమైన చర్యలు తీసుకునే విషయంలో రైల్వేశాఖ నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొంది.

---------------------------

వ్యవసాయరంగ అభివృద్ధితోపాటు రైతులకు విస్తృతమైన సేవలందించేందుకు దేశంలో మరో 114 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి..ఐకార్ డైరెక్టర్ జనరల్ హిమాన్ష్ పాఠక్ తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక కార్యాచరణ ప్రణాళికపై రెండు రోజుల సదస్సు నిన్న ప్రారంభమైంది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన పాఠక్ మాట్లాడుతూ.. దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాలను ప్రారంభించి 50 సంవత్సరాలైందని... అవి వ్యవసాయ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్నకేంద్రాలను ఆధునీకరించి రైతులకు మరింత మెరుగైన సేవలందిస్తామని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రెండవ రోజు నామినేషన్ల ప్రక్రియ కోలాహలంగా సాగింది. నిన్న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామపత్రాలు సమర్పించారు. చిత్తూరు జిల్లా కుప్పంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తరపున ఆయన సతీమణి భువనేశ్వరి, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానానికి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నామినేషన్ దాఖలు చేశారు. కాగా.. 25 పార్లమెంటు స్థానాలకు 53 మంది అభ్యర్థులు 68 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, 175 శాసన సభ స్థానాలకు 314 మంది అభ్యర్థులు 413 సెట్ల నామినేషన్లు సమర్పించారు.

---------------------------

తమ ప్రభుత్వంలో వివక్ష, లంచాలు లేని పాలన అందించామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర నిన్న కాకినాడ జిల్లాలో కొనసాగింది. కాకినాడ అచ్చంపేట జంక్షన్ వద్ద జరిగిన బహిరంగ సభలో జగన్మోహన్ రెడ్డి

మాట్లాడుతూ.. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు వచ్చే ఐదేళ్లలో కొనసాగాలా? వద్దా? అన్నది ఓటు ద్వారా నిర్ణయించుకోవాలని ప్రజలను కోరారు.

---------------------------

ఈ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్‌ను మార్చే ఎన్నికలని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఆలూరు, అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం పరిధిలోని కణేకల్‌లో నిన్న నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అప్పులపాలు జేసీ, ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ కూటమి అధికారంలోకి రాగానే.. మెగా డీఎస్సీపైనే తొలి సతకం పెడతానని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థలకు ప్రాధాన్యమిస్తామని, గ్రామాల్లో సర్పంచ్‌లకే అధికారం ఉంటుందని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి శిలాఫలకాల ఏర్పాటుకు పరిమితమై, ప్రాజెక్టుల నిర్మాణాన్ని మరచిపోయారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఆరోపించారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో నిన్న నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ.. వేదవతి ప్రాజెక్టును పూర్తి చేస్తానని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని.. ఐదేళ్లలో ప్రాజెక్టు పనులు ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదని విమర్శించారు. 2008లో వైఎస్.రాజశేఖరరెడ్డి శిలాఫలకం వేస్తే.. అదే ప్రాజెక్టుకు జగన్మోహన్ రెడ్డి మరో శిలాఫలకం వేశారని, ఈ ప్రాజెక్టు కట్టి ఉంటే 80వేల ఎకరాలకు సాగునీరు వచ్చి ఉండేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, తమకు అధికారమిస్తే 2 లక్షల 25 వేల ఉద్యోగాలు ఇస్తామని షర్మిల హామీ ఇచ్చారు.

---------------------------

పోస్టల్ బ్యాలెట్ జారీ ప్రక్రియలో అధికారుల మధ్య ఉన్న సందిగ్ధతను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఎన్నికల సంఘానికి ఏపీ జేఏసీ అమరావతి, ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ దామోదరరావు నిన్న అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనాను కలిసి వినతిపత్రం అందజేశారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఎన్నికల సిబ్బందికి మే మొదటి వారంలో ఏదో ఒక పనిదినాన్ని ప్రత్యేక క్యాజువల్ లీవ్‌గా ప్రకటించి, వారి ఓటు ఉన్న నియోజకవర్గాల ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని సీఈవోను కోరినట్లు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతోపాటు.. వడగాడ్పులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. నిన్న రాష్ట్రంలోని 61 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. 117 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో అత్యధికంగా 46 డిగ్రీలు, సాలూరులో 45.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ రోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల్లోని 55 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు.. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు, తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల్లో 197 మండలాల్లో ఒక మోస్తరు స్థాయిలో వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

అటు.. తెలంగాణలో పలు జిల్లాల్లో నిన్న అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. కొన్ని జిల్లాల్లో అకాల

వర్షాలు బీభత్సం సృష్టించాయి. రాష్ట్రంలో అత్యధికంగా నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాద్రి, ఆదిలాబాద్, ములుగు, జగిత్యాల, ఖమ్మం, మంచిర్యాల, ఆసిఫాబాద్, సూర్యాపేట జిల్లాల్లో 44.3 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఈ రోజు, రేపు పలు జిల్లాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది.

---------------------------

ప్రాథమిక విద్యలో రెండేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు డీఈ సెట్-24 నోటిఫికేషన్‌ను ఈ నెల 22న విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థలు..డైట్, ప్రభుత్వేతర ఉపాధ్యాయ శిక్షణ సంస్థల్లో అందుబాటులో ఉన్న కోర్సులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన నిన్న ఒక ప్రకటనలో సూచించారు. నోటిఫికేషన్, సమాచార బులెటిన్, పరీక్షా తేదీల వివరాలను 22వ తేదీ నుంచి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

=======================